సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం | 25 | మార్చి | 2023



వసంత నవరాత్రి ఉత్సవాలు

పెంటపాడు: కె.పెంటపాడు బైరాగిమఠం లోని వేణుగోపాలస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నేటినుంచి క్రికెట్ పోటీలు

దెందులూరు: వేగవరంలోని హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ సౌత్ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు శనివారం మధ్యాహ్నం ప్రారంభం కానున్నాయి.

బలుసులమ్మకు కుంభ నివేదిక



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది ఉత్సవాల ముగింపు సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మవారికి శుక్రవారం అఖండ నైవేద్యాన్ని (కుంభ నివేదన) సమర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సహరి (ఆదివారం వేకువజాము)
భీమవరం	6.23	4.44
తాడేపల్లిగూడెం	6.25	4.52
నరసాపురం	6.22	4.43

న్యూస్‌రీల్

నాయీ బ్రాహ్మణుల ధన్యవాదాలు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేవదాయశాఖ దేవస్థానాల్లో జీఓ 110 ద్వారా కేశఖండనశాలకు సంబంధించి ఉద్యోగ భద్రత కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య, డైరెక్టర్లు వి.నూకరాజు, పట్నాల గౌరీ, నాయీ బ్రాహ్మణ సంఘం ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ పట్నాల గణపతి ఉన్నారు.

పక్కాగా పోషకాహారం



సమీక్షిస్తున్న ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

భీమవరం(ప్రకాశం చౌక్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారాన్ని సరైన కొలతల ప్రకారం పక్కాగా అందించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అంగన్‌వాడీ, సివిల్ సప్లయిస్, వైద్యారోగ్యశాఖ అధికారులు, సప్లయర్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పప్పు, బాలామృతం, బియ్యం, కోడిగుడ్లు, పాలను సరైన సమయంలో అందించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరుకుల సరఫరాపై సమీక్షించారు. ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి, డీఎంహెచ్‌ఓ బి.మహేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎన్.సరోజ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ పాల్గొన్నారు.

ఆక్వాలో ఆర్గానిక్ ఫార్మింగ్ మేలు



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఆర్గానిక్ ఫార్మింగ్ విధానంలో చేపల పెంపకం చేపట్టి అదే నీటితో మొక్కలను పెంచవచ్చని, అలాగే చేపలను పెంచే నీటిని తిరిగి రీసైక్లింగ్ చేసి ఆక్వాసాగులో వినియోగించవచ్చని ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ హెడ్ సైంటిస్ట్ టి.నీరజ అన్నారు. స్థానిక కేజీఆర్ఎల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆక్వాకల్చర్–ప్రస్తుత అధునాతన విధానాలు అనే అంశంపై జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. చేపల పెంపకంలో ఈ ప్రాంత రైతులకు అపారమైన జ్ఞానం ఉన్నా ఆక్వా పరిశ్రమలకు నిపుణుల కొరత ఉందన్నారు. ఐసీఏఆర్ సీనియర్ సైంటిస్ట్ అన్నం పవన్‌కుమార్ మాట్లాడుతూ పూర్వపు ఉభయగోదావరి జిల్లాల్లో ఆక్వా సాగుపై రైతులకు అవగాహన ఉందన్నారు. ప్రిన్సిపల్ మెంటే హరినాథబాబు, వైస్ ప్రిన్సిపాల్ మేరగాని అప్పారావు, కళాశాల సెక్రటరీ మెంటే రామ్‌మనోహర్, ట్రెజరర్ గన్నాబతుల వెంకట శ్రీనివాస్, పీజీ డైరెక్టర్ తోట రామూర్తి పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలని తీర్మానంపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున శాసనసభలో తీర్మానం చేయడం, పార్లమెంట్‌లోనూ తీర్మానం చేయాలని కేంద్రానికి పంపించడంపై మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీలో చేర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు పలు సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సమస్యను గుర్తించి తీర్మానం చేసేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళాభ్యున్నతికి ఆసరా

చెప్పాడంటే.. చేస్తాడంతే..

- అక్కచెల్లెమ్మలకు ఆలంబన
- ఎన్నికల హామీకి అనుగుణంగా అడుగులు
- ఏలూరు, 'పశ్చిమ' జిల్లాల్లో మొత్తంగా రూ.2,006.78 కోట్ల లబ్ధి
- నేడు మూడో విడత ఆసరాకు దెందులూరులో శ్రీకారం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పాదయాత్రలో అక్కచెల్లెమ్మల కష్టాలను ప్రత్యక్షంగా చూశారు.. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.. మహిళాభ్యుదయమే లక్ష్యంగా.. డ్వాక్రా సంఘాల రుణ భారాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చి.. అధికారం చేపట్టిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ మేరకు ఇప్పటికే రెండు విడతల్లో డ్వాక్రా మహిళలకు ఆసరా సాయం అందించగా.. మూడో విడత నగదు పంపిణీకి శనివారం దెందులూరులో శ్రీకారం చుట్టనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మహిళలకు మొత్తంగా మూడు విడతల్లో రూ.2,006.78 కోట్ల లబ్ధి చేకూర్చనున్నారు.

వైఎస్సార్ ఆసరా లబ్ధి ఇలా..

విడత	ఏలూరు (రూ.కోట్లలో)	పశ్చిమగోదావరి (రూ.కోట్లలో)
మొదటి	360.69	349.18
రెండో	364.15	261.91
మూడో (ప్రస్తుతం)	364.39	306.46
మొత్తం	**1,089.23**	**917.55**

ఆర్థిక స్వావలంబనకు.. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరా పథకం కీలకంగా మారింది. చిరువ్యాపారాలతో ప్రారంభమైన మహిళల ప్రస్థానం కుటీర పరిశ్రమలు దాటి మహిళా మార్ట్‌ల దిశగా అడుగులు వేస్తోంది. పొదుపు ద్వారా రాబడితో పాటు ప్రతి నెలా స్థిరమైన ఆదాయం పొందేందుకు దోహదపడుతోంది. 2019 ఎన్నికల నాటికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం రూ.2,770 కోట్ల మేర మహిళలపై రుణభారం ఉండగా నాలుగు విడతల్లో చెల్లిస్తామనే హామీ మేరకు ఇప్పటికే రెండు విడతల చెల్లింపు పూర్తయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ద్వారా, పట్టణ, నగర ప్రాంతాల్లో మెప్మా ద్వారా ఆసరా సాయం అందిస్తున్నారు.

జీవనోపాధి మెరుగుపడింది



ఆసరా సాయం రూ.21 వేలకు బ్యాంకు రుణం కలిపి సొంతంగా కిరాణా దుకాణం నడుపుతున్నాను. నెలకు రూ.10 వేల వరకు ఆదాయం వస్తోంది. స్వయం ఉపాధి ద్వారా నా జీవనోపాధి మెరుగుపడింది. పిల్లలను చదివించుకోగలుగుతున్నా. ఇందుకు సాయపడిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నా. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

– వాసే వరలక్ష్మి, మత్తేవారిగూడెం, ద్వారకాతిరుమల మండలం

ఆనందంగా ఉంది



నేను రూ.17,975 చొప్పున రెండు విడతల్లో రూ.35,950 లబ్ధి పొందాను. ఇప్పుడు మూడో విడత సాయం అందుకోనున్నా. సీఎం జగన్ అక్కచెల్లెమ్మలకు క్రమం తప్పకుండా రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది.

– టి.మావుళ్లమ్మ, తాడేరు, భీమవరం

ఇచ్చిన మాట ప్రకారం



సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీని విడతలవారీగా అందించడం సంతోషంగా ఉంది. నాకు రెండు విడతల్లో రూ.48,808 రుణమాఫీ లబ్ధి అందింది. మూడో విడతలో రూ.24,440 అందుకోనున్నాను. ఆర్థిక సాయం చాలా ప్రయోజనకరంగా ఉంది.

– పి.సీత, కొవ్వాడ అన్నవరం, భీమవరం

మిల్క్‌పార్లర్ స్థాపించా..



ఆసరా సాయం, బ్యాంకు రుణంతో గ్రామంలో మిల్క్ పార్లర్ ప్రారంభించా. నెలకు రూ.15 వేల ఆదాయం వస్తోంది. దీంతో మా ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. సమాజంలో గౌరవంగా బతుకుతున్నాం. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవే. ఇప్పుడు మూడో విడత ఆసరా సాయం కింద నాకు రూ.20 వేల లబ్ధి చేకూరనుంది. ఈ మొత్తాన్ని కూడా నా వ్యాపారాభివృద్ధికి వినియోగించుకుంటాను.

– సిరిబత్తిన సంధ్యారాణి, పెదవేగి



సిద్ధమైన సభాస్థలి

సర్వ సన్నద్ధం

- నేడు దెందులూరుకు సీఎం జగన్ రాక
- వైఎస్సార్ ఆసరా మూడో విడత ప్రారంభం
- పూర్తయిన ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి,ఏలూరు/దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఏలూరు జిల్లా ముస్తాబైంది. వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని దెందులూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం సీఎం జగన్ దెందులూరులో హెలీప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. శుక్రవారం సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి ట్రయిల్‌రన్ నిర్వహించారు. ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు కూడా తావులేకుండా పక్కా ఏర్పాట్లు చేశారు. పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. సభకు వచ్చేవారికి తాగునీరు, ఇతర అవసరాలకు ఏర్పాట్లు చేశారు. సీఎం సభా వేదిక, ప్రత్యేక గ్యాలరీల పనులు పూర్తయ్యాయి. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సీఎం పర్యటన ఇలా..

- ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దెందులూరులో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- ఉదయం 10.30 నుంచి 10.40 గంటల వరకు హెలీప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుస్తారు.
- ఉదయం 10.50 గంటలకు సీఎం జగన్ సభాప్రాంగణానికి చేరుకుని మధ్యాహ్నం 12.35 గంటల వరకు సభలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 12.45 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- మధ్యాహ్నం 1.05 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి పయనమవుతారు.

అట్టహాసంగా 'సాక్షి' 15వ వార్షికోత్సవం



'సాక్షి' దినపత్రిక 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ప్రత్తిపాడు యూనిట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూనిట్ మేనేజర్, పలు విభాగాల ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 'సాక్షి' చైర్‌పర్సన్ వైఎస్ భారతి ఆన్‌లైన్‌లో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. 'సాక్షి'ని ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు. – పెంటపాడు

తణుకులో ఎమ్మెల్సీల విజయోత్సవ ర్యాలీ

తణుకు అర్బన్: తణుకులో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శాసనమండలి సభ్యుల విజయోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, పార్టీ నాయకులతో కలిసి మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా రాష్ట్రపతి రోడ్డు మీదుగా బాలుర హైస్కూల్ ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్సీలు రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌ను యువనేత కారుమూరి సునిల్‌కుమార్ ఘనంగా సత్కరించారు.

సీఎం జగన్ ఛరిష్మాతోనే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో రాష్ట్రంలో 21 ఎమ్మెల్సీ స్థానాల్లో 17 ఎమ్మెల్సీలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుందని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ అన్నారు. విలువలకు పట్టం కడుతూ సీఎం జగన్ రాజకీయాలు చేస్తుంటే.. చంద్రబాబు వైఎస్సార్ సీపీలోని ఇద్దరు ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి అడ్డదారిలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకున్నారని విమర్శించారు.



బైక్ ర్యాలీలో ఎమ్మెల్సీలు కవురు, వంక

సామాజిక అస్త్రంతో పదవులు

సామాన్యుడినైన తనలాంటి వారికి సామాజిక అస్త్రంతో పదవులు కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ స్పష్టం చేశారు. సీఎం జగన్ అండతో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ చొరవతో ఎమ్మెల్సీగా గెలిచామన్నారు. చంద్రబాబు అడ్డదారిలో కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఇండుగపల్లి బలరామకృష్ణ, జంగం ఆనంద్‌కుమార్, మక్కా సూర్యనారాయణ, వావిలాల సరళాదేవి, పైబోయిన సత్యనారాయణ, పోలేపల్లి వెంకట ప్రసాద్, బోడపాటి వీర్రాజు, గుబ్బల సూర్యచంద్రరావు, ఉండవల్లి జానకి, కాకర్ల విశాలాక్షి, మెట్ల కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆసరా సంబరాలు

- వచ్చేనెల 5 వరకు కార్యక్రమాలు
- నియోజకవర్గ, మండల స్థాయిలో నిర్వహణ
- జిల్లాలో 25,878 గ్రూపులకు ఆసరా లబ్ధి అందజేత



భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వ పలు పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తోంది. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా డాక్రా సంఘాలకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా పథకం కింద అందిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల సాయం అందించగా.. శనివారం మూడో విడత కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని 25,878 గ్రూపులకు ఆసరా లబ్ధిని చేకూర్చనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించనున్నారు.

పది రోజులపాటు..

శనివారం ఉదయం భీమవరం కలెక్టరేట్‌లో ఆసరా లబ్ధిదారులకు కలెక్టర్ ప్రశాంతి నమూనా చెక్కు అందిస్తారు. ఆదివారం నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకూ పది రోజులపాటు జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ, మండల స్థాయిల్లో ఆసరా సంబరాలు నిర్వహించి.. ఆయా ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు లబ్ధిని అందిస్తారు. ఈ మేరకు అధికారులు కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. నియోజవర్గం స్థాయిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఆసరా సంబరాలు జరుగనున్నాయి. మండలస్థాయిలో జరిగే కార్యక్రమాల్లోనూ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొంటారు.

షెడ్యూల్ ప్రకారం సంబరాలు



వైఎస్సార్ ఆసరా మూడో విడతకు సంబంధించి శనివారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సాయం అందిస్తారు. ఆదివారం నుంచి జిల్లావ్యాప్తంగా ఆసరా సంబరాలు నిర్వహించనున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌ల సమయపాలన బట్టి షెడ్యూల్ ప్లాన్ చేసి సంబరాలను ప్రజాప్రతినిధుల చేతులమీదుగా నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నాం.

– ఎంఎస్‌వీ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ, భీమవరం

నియోజకవర్గాల వారీగా లబ్ధి ఇలా..

వైఎస్సార్ ఆసరా పథకంలో ఇప్పటికే 2020–21, 2021–22 సంవత్సరాల్లో లబ్ధిని అందించగా తాజాగా 2022–23కు సంబంధించి రుణమాఫీ సొమ్ములను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా సంఘాలు, లబ్ధి ఇలా ఉంది. ఆచంటలో 3,700 గ్రూపులకు రూ.37.02 కోట్లు, భీమవరంలో 2,924 సంఘాలకు రూ.28.94 కోట్లు, నరసాపురంలో 4,143 సంఘాలకు రూ.32.92 కోట్లు, పాలకొల్లులో 3,839 సంఘాలకు రూ.38.54 కోట్లు, తణుకులో 4,142 సంఘాలకు రూ.41.42 కోట్లు, తాడేపల్లిగూడెంలో 2,898 సంఘాలకు రూ.25.19 కోట్లు, ఉండిలో 5,232 సంఘాలకు రూ.62.64 కోట్లు అందించనున్నారు.

భీమవరంలో రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

జిల్లా అధ్యక్షురాలికి వ్యతిరేకంగా నిరసన

సాక్షి, భీమవరం: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యమివ్వడం లేదంటూ భీమవరంలో తెలుగు తమ్ముళ్లు రోడ్డెక్కారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి ఒంటెద్దు పోకడలతో పార్టీ తీవ్రంగా నష్టపోతుందంటూ శుక్రవారం పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల టీడీపీ భీమవరం పట్టణ అధ్యక్ష పదవికి పట్టణంలోని 39 వార్డుల అధ్యక్ష, కార్యదర్శుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అయితే అధ్యక్ష పదవికి ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజును ఎంపిక చేసినట్టు ప్రకటించడంతో పార్టీలో ముసలం రేగింది. పార్టీ నేత చిరుకూరి రామకృష్ణచౌదరి నాయకత్వంలో పార్టీ శ్రేణులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ అభిప్రాయ సేకరణలో మెజార్టీ సభ్యులు తన పేరును సూచించగా.. జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తనను కాదని సుబ్రహ్మణ్యంరాజు పేరును ప్రకటించారని ఆరోపించారు. మూడేళ్లుగా పట్టణ కమిటీ ఎన్నిక నిర్వహించలేదని పార్టీ శ్రేణులు ఒత్తిడి చేయడంతో చేపట్టిన ఎన్నికలో పార్టీని భ్రష్టుపట్టించేలా ఎంపిక చేశారని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారిని సీతారామలక్ష్మి ఎదగనివ్వడం లేదని మండిపడ్డారు. పట్టణ అధ్యక్ష ఎన్నిక చెల్లదని, తానే పట్టణ అధ్యక్షుడినని, తన నేతృత్వంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీతారామలక్ష్మిని ఆయా పదవుల నుంచి తొలగించే వరకు పోరాటం చేస్తామని చౌదరి హెచ్చరించారు.



ప్రదర్శన చేస్తున్న టీడీపీ శ్రేణులు

క్షయ వ్యాధి నివారణకు కృషి

భీమవరం(ప్రకాశం చౌక్): క్షయ బారిన పడిన వారికి గుర్తించి సరైన చికిత్స అందిస్తే వ్యాధిని సులభంగా నిర్మూలించవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. టీబీ నివారణకు మరింత ఫోకస్‌గా పనిచేయాలని వైద్యాధికారులకు సూచించారు. 2025 నాటికి జిల్లాలో నూరుశాతం టీబీరహితంగా మార్చాలన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, డీఆర్వో కె.కృష్ణవేణి మాట్లాడారు. అనంతరం వైద్యశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు. టీబీ నివారణపై మూడు రకాల పోస్టర్లను ఆవిష్కరించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను కలెక్టర్ చేతులమీదుగా అందించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

క్లుప్తంగా

బొట్టు పెట్టుకోలేదని మందలించడంతో ఆత్మహత్య

ద్వారకాతిరుమల: బొట్టు పెట్టుకోలేదని భర్త మందలించడంతో మనస్తాపానికి గురైన ఒక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ద్వారకా తిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని వెంకటకృష్ణాపురానికి చెందిన కంతేటి భాను(34)ను బొట్టు పెట్టుకోలేదని ఈనెల 21న ఆమె భర్త వెంకట్రావు మందలించాడు. దాంతో మనస్తాపానికి గురైన భాను బాత్‌రూమ్‌లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు హుటాహుటీన ఆమెను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి చింతపల్లి భవానీ ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్ : గురువారం రాత్రి పట్టణంలోని తణుకు రోడ్డులో బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి 45 ఏళ్ళ వయసు ఉండవచ్చని, ఒంటిపై సిమెంటు రంగు, తెలుపు రంగు అడ్డ చారలతో చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి ఎడమ భాగం పొట్టమీద, కుడి భాగం మెడమీద పుట్టుమచ్చలు ఉన్నాయని చెప్పారు. ఎత్తు 5.3 అడుగులు ఉన్నట్లు చెప్పారు. వివరాలు తెలిస్తే 98661 14556 నెంబరుకు తెలియచేయాలని కోరారు.

ఏప్రిల్‌లో రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

సాక్షి, భీమవరం: ఆంధ్రా క్లాసిక్ ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఏప్రిల్ 9న విజయనగరం జిల్లా పార్వతీపురంలో నిర్వహిస్తున్నట్లు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్, ఇన్‌చార్జ్ కార్యదర్శి షేక్ ఖాసీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు అందచేస్తారని ఆసక్తి కలిగిన బాడీ బిల్డర్స్ 93477 77778, 98857 39955 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసులకు ఆర్థిక భరోసా

- బకాయిల చెల్లింపుపై హర్షం
- ఉమ్మడి పశ్చిమలో 2,550 మంది పోలీసులకు లబ్ధి
- సుమారుగా రూ.8 కోట్లు విడుదల



ఏలూరు టౌన్: పోలీసులకు ఇవ్వాల్సిన అలవెన్సు బకాయిలు మంజూరు చేయటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు జీతాల విషయంలో పెద్దగా ఇబ్బంది లేకున్నా.. అలవెన్సుల బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడంతో పోలీసులకు ఆర్థిక భరోసా లభించింది. బకాయిల చెల్లింపులతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలన గాడిలో పెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లింపులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

పోలీసులకు ఊరట

ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి పశ్చిమలో సుమారు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ స్థాయి నుంచి ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, కానిస్టేబుల్ వరకూ అలవెన్సుల బకాయిలు మంజూరవుతున్నాయి. సుమారు 11 నెలలుగా పేరుకుపోయిన ట్రావెలింగ్ అలవెన్సు బకాయిలు ఒకేసారి విడుదల చేయటంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఆర్ఏ, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు సైతం మంజూరు చేయటంతో పోలీసులు సంతోషంగా ఉన్నారు. ఇక సరెండర్ లీవ్స్, అదనపు సరెండర్ లీవ్స్ బకాయిలు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా త్వరలోనే మంజూరు చేస్తారని అంటున్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం బకాయిలు విడుదల చేసింది. రెండు జిల్లాల్లోనూ సుమారు ఆయా బకాయిల చెల్లింపులు రూ.8 కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. ఒక్క టీఏ అలవెన్సు బకాయిలు సుమారుగా రూ. 3.82 కోట్ల నుంచి రూ. 4.12 కోట్ల వరకూ ఉందని అధికారులు అంటున్నారు. వీటితో పాటు హెచ్ఆర్ఏ, ఇతర బకాయిలు చూస్తే రెండు జిల్లాలోనూ పోలీసుల శాఖకు రూ.8 కోట్ల వరకూ బకాయిలు చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు సైతం విడుదల కావటంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ శాఖలో సీఐలు- 30 , సబ్ ఇన్స్‌పెక్టర్లు -120, ఏఎస్ఐ -150, హెడ్ కానిస్టేబుల్స్ - 450 , కానిస్టేబుల్స్ - 1850 మంది ఉన్నారు. మొత్తంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2600 మంది వరకూ పోలీస్ సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట



పోలీస్ శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. సిబ్బంది అనారోగ్యంతో మరణిస్తే సంక్షేమ నిధి నుంచి ఆర్థికంగా ఆదుకుంటున్నాం. తాజాగా ప్రభుత్వం అలవెన్సు బకాయిలు విడుదల చేసింది. టీఏ అలవెన్సులు, హెల్త్, హెచ్ఆర్ఏ ఇలా అన్నీ మంజూరు చేశారు.

– రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఎస్పీ

సరెండర్ లీవ్స్ చెల్లింపునకు చర్యలు



పోలీస్ సిబ్బంది, అధికారులకు సంబంధించి పేరుకుపోయిన అలవెన్సు బకాయిలు ప్రభుత్వం చెల్లించటం హర్షణీయం. సరెండర్ లీవ్స్, అదనపు సరెండర్ లీవ్స్ విడుదల చేయాల్సి ఉంది. అవి కూడా త్వరలోనే మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పోలీసులకు ఒకేసారి ఆర్థికంగా ఊతం ఇచ్చినట్లయ్యింది. పోలీస్ అధికారుల సంఘం నిత్యం సిబ్బంది, అధికారుల సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తూ పరిష్కారానికి కృషి చేస్తోంది.

– బందారు నాని, పోలీస్ అధికారుల సంఘం జిల్లా ట్రెజరర్, ఏలూరు

బకాయిల చెల్లింపులు హర్షణీయం



ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్ సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలన్నీ చెల్లించడం హర్షణీయం. సిబ్బందికి ఏ సమస్య వచ్చినా పోలీస్ అధికారుల సంఘం వారికి అండగా ఉంటుంది. పోలీస్ సిబ్బందికి 11 నెలల టీఏ అలవెన్సులతోపాటు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, హెల్త్ అలవెన్సులు సైతం విడుదల చేశారు. అలాగే బకాయిలు లేకుండా సిబ్బందికి అలవెన్సులు కూడా మంజూరు చేయాలని కోరుకుంటున్నాం.

– ఆర్.నాగేశ్వరరావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

ఆర్టీసీ కండక్టర్ నిజాయతీ

పోగొట్టుకున్న బంగారు గొలుసు అందజేత



ప్రయాణికుడికి బంగారు గొలుసు అందజేస్తున్న కండక్టర్ నిషారుద్దీన్

నరసాపురం : నరసాపురం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఎండీ నిషారుద్దీన్ నిజాయతీ చూపించారు. బస్సులో బాలిక పడేసుకున్న బంగారు గొలుసును ఆమె తండ్రికి అప్పగించారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం 2.30 గంటలకు నరసాపురం నుంచి ఏలూరు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ బస్సులో భీమవరానికి చెందిన మున్సిపల్ ఉద్యోగి కడిలి సురేష్ తన 8 ఏళ్ల కూతురు ముత్యాలుతో కలసి పాలకొల్లులో బస్సు ఎక్కారు. ఏలూరులో దిగిన తరువాత సురేష్ తన కూతురు మెడలో బంగారు చైన్ లేని విషయాన్ని గుర్తించాడు. బస్సులో పడిపోయి ఉండొచ్చని భావించి, ఏలూరు బస్టాండ్‌కు వెళ్లి వివరాలు చెప్పి కండెక్టర్ నిషారుద్దీన్‌కు ఫోన్ చేశాడు. వారు కూర్చున్న సీటు నెంబర్ వివరాలు తెలిపాడు. ఈ లోపు బస్సు తిరుగుప్రయాణంలో కైకలూరు వద్దకు చేరింది. కైకలూరులో నిషారుద్దీన్ బస్సులో వాళ్లు కూర్చున్నచోట తనిఖీ చేయగా చైన్ కనిపించింది. దీంతో భీమవరంలో బంగారు గొలుసును సురేష్‌కు అందజేశారు.

ఇంటర్ పరీక్షలకు 30,199 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన గణితం పేపర్-2బీ, జువాలజీ -2, హిస్టరీ -2 పరీక్షలకు కేటాయించిన 106 కేంద్రాల్లో మొత్తం 31,037 మంది విద్యార్థులకు 30199 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 9679 మంది జనరల్ విద్యార్థులకు 9441 మంది, 1607 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1471 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 13,933 మంది జనరల్ విద్యార్థులకు 13662 మంది, 1526 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1420 మంది హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 3599 మంది జనరల్ విద్యార్థులకు 3549 మంది హాజరయ్యారు.

వ్యక్తి ఆత్మహత్య

టి.నరసాపురం: మండలంలోని తిరుమలదేవిపేటలో వీరభద్రరానికి చెందిన నైనారపు బ్రహ్మయ్య(52) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బ్రహ్మయ్య పనిచేసే రైతు పొలంలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. తన తండ్రి కడుపు నొప్పితో బాధపడేవాడని, కడుపునొప్పి తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏలూరు సత్యనారాయణ థియేటర్‌లో మాట్లాడుతున్న హీరో విశ్వక్‌సేన్

దాస్ కా ధమ్కీకి ప్రేక్షకుల ఆదరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొత్తదనంతో కూడిన వినోదాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని దాస్ కా ధమ్కీ చిత్రం ద్వారా మరోసారి నిరూపించారని ఆ చిత్ర హీరో విశ్వక్‌సేన్ తెలిపారు. దాస్ కా ధమ్కీ చిత్ర యూనిట్ విజయోత్సవ యాత్ర శుక్రవారం నగరానికి చేరుకుంది. చిత్రం ప్రదర్శితమవుతున్న స్థానిక సత్యనారాయణ థియేటర్‌కు చిత్ర బృందం వెళ్లింది. ప్రేక్షకులతో హీరో కాసేపు ముచ్చటించారు. తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ థియేటర్ మేనేజర్లు రాము, గోపి, సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

తణుకు: తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతిచెందాడు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామంలో ఇటుకల బట్టీలో పని చేస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని పరగణా జిల్లా చండీభాన్ మండలం తునాఘాట్‌కు చెందిన టాపు మండల్ (32) మృతి చెందాడు. రెండు నెలలుగా బట్టీలో పని చేస్తున్న అతను శుక్రవారం తెల్లవారుజామున తాడేపల్లిగూడెం ఇటుకల లోడుతో వెళుతుండగా తేతలి సమీపంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సమయంలో ట్రాక్టర్‌పై కూర్చున్న టాపుమండల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కేవీ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన టాపు మండల్

సమస్యలను ప్రతిబింబించిన నాటికలు

తాడేపల్లిగూడెం: 30వ జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలలో భాగంగా బీవీఆర్ కళాకేంద్రంలో జరుగుతున్న నాటికలు అందరినీ అలరిస్తున్నాయి. సమకాలీన సమస్యలను ప్రతిబింబించేలా సాగుతున్నాయి. గురు, శుక్రవారాల్లో ప్రదర్శించిన నాటికలు ఆలోచింపచేశాయి. వ్యక్తుల బలహీనతల ఆధారంగా ఆస్తులను కాజేయాలనుకునే వారి కుట్రలు ఎలా ఉంటాయి.. వారి స్వార్థ ఆలోచనలు ఎలా సాగుతాయనే అంశాన్ని తీసుకుని ప్రదర్శించిన పక్కింటి మొగుడు ఆకట్టుకుంది. లాయర్ ముసుగులో ఒక వ్యక్తి చేసిన కుట్రను రెండు కుటుంబాలు ఒక్కటిగా మారి ఎలా అడ్డుకున్నాయనే అంశం రక్తికట్టించింది. ఈ నాటికను గోవిందరాజుల నాగేశ్వరరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. హేలాపూరి కల్చరల్ అసోసియేషన్ ఏలూరు వారు ప్రదర్శించిన మనసున మనసై నాటికను చింతల మల్లేశ్వరరావు, పెద్దిబోయిన కృష్ణ హితేష్ రచించగా, మహ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు. అలాగే రిత్విక్ వెంకట్, చార్మిల వెంకట్ (హైదరాబాద్) నృత్య ప్రదర్శనలు, రమ్యశ్రీ డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శనలు కళా అభిమానులను ఆకట్టుకున్నాయి. నాట్యాచారిణి భారతి మోహన్ శిష్య బృందం ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.



పక్కింటిమొగుడు నాటికలోని సన్నివేశం

శ్రీవారి ఆలయంలో సెక్యూరిటీ సంస్థకు నోటీసులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో వివాహం చేసుకుంటున్న ఒక భక్తుడి నుంచి టికెట్లు పేరుతో సెక్యూరిటీ గార్డు రూ. 1,000లు వసూలు చేయడంపై ఆలయ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత సెక్యూరిటీ సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఈఓ వేంద్ర త్రినాథరావు శుక్రవారం ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కొందరు సెక్యూరిటీ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సెక్యూరిటీ గార్డు చేతి వాటం, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఓ శైలిపై సంబంధిత సెక్యూరిటీ సంస్థకు నోటీసులు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మాజీ సైనికుల సమస్యలపై ఆరా

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో మాజీ సైనికులతో మద్రాస్ రెజిమెంట్ కాప్స్(ఎంఆర్‌సీ) టీం శుక్రవారం భేటీ అయ్యింది. ఈ టీంలో సుబేదార్ ఆదినారాయణ, హవల్దార్ మహేష్ బాబు, హవల్దార్ అనిల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సుమారు 46 మంది మాజీ సైనికులు తమ సమస్యలను విన్నవించగా, 12 మంది సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి సంబంధిత పత్రాలను జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ద్వారా యూనిట్‌కు సమర్పించాల్సి ఉందని ఎంఆర్‌సీ టీమ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీఎస్.ప్రసాదరావు, సిబ్బంది వైఎస్.రెడ్డి, బడేటి శ్రీనివాస్, సుధాకర్, మాధవరం సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బొల్లం వీరయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో మాజీ సైనికులతో మద్రాస్ రెజిమెంట్ సభ్యులు

డ్వాక్రా సొమ్ము మాయంపై గొడవ

వీరవాసరం: డ్వాక్రా సొమ్మును బ్యాంకు లోన్‌కు జమ చేయకుండా వాడుకున్న సంఘటనపై డ్వాక్రా సభ్యులు, గ్రూప్ లీడర్ మధ్య శుక్రవారం వివాదం చోటుచేసుకుంది. వీరవాసరం వెలమపేటకు చెందిన శ్రీ మహాలక్ష్మి గ్రూపునకు సంబంధించి గ్రూప్ లీడర్‌గా ఉన్న నిద్ర పావనికి గ్రూపు సభ్యులు నెలనెలా నగదు ఇస్తుండగా.. ఆ నగదును బ్యాంకుకు జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంటుంది. విషయం తెలుసుకున్న గ్రూపు సభ్యులు గత సంవత్సరం నవంబర్‌లో పెద్దలు, పోలీసుల సమక్షంలో రూ.3.80 లక్షలు వాడుకున్నట్లు నిర్ధారించి.. మార్చి నెలాఖరు నాటికి వాడుకున్న సొమ్మును కట్టేలా ఒప్పందం చేసుకున్నారు. మార్చి నెలాఖరు వస్తున్నా లక్ష రూపాయలు మాత్రమే జమ చేయడంతో గ్రూపు సభ్యులు నిలదీశారు. గురువారం రాత్రి పావనిని స్థానిక వినాయక గుడికి తీసుకువచ్చి నగదు విషయం అడిగారు. సమాధానం సరిగా రాకపోవడంతో రాత్రంతా గ్రూపు సభ్యుల మధ్య పావనిని ఉంచారు. శుక్రవారం ఉదయం గుడి నుంచి బయటకు వస్తుండగా అక్కడే ఉన్న స్తంభానికి గ్రూప్ సభ్యులు కట్టి నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పావని కుటుంబ సభ్యులు వెళ్లి గ్రూపు సభ్యులను నిలదీశారు. పావని భర్త పోలయ్య స్థానిక పోలీసులకు సమాచారం అందించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరవాసరం పోలీసులు సంఘటన ప్రాంతాన్ని సందర్శించి గ్రూపు సభ్యులపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వీరవాసరం పోలీసులు తెలిపారు.

● ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు



భీమవరం కాస్మో క్లబ్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. 35 ప్లస్, 45 ప్లస్, 55 ప్లస్ విభాగాల్లో క్వార్టర్‌ఫైనల్ పోటీలు నిర్వహించగా.. 65 ప్లస్, 75 ప్లస్ విభాగాల్లో సెమీఫైనల్ పోటీలు నిర్వహించారు.

-సాక్షి, భీమవరం

డ్రెయిన్‌లో పడి వృద్ధుడి మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన నిట్టపాటి ఏలియా (78) మురుగు డ్రెయిన్‌లో పడి మృతి చెందినట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ చింతపల్లి మూర్తి తెలిపారు. ఏలీయాకు మతిస్థిమితం లేదు. అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళిపోతూ మళ్లీ వచ్చేవాడు. ఈ నెల 21వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఏలీయా కుమారుడు ఏలీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన 8వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు స్కూలు ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లీశ్వరి శుక్రవారం తెలిపారు. సీహెచ్.రిషిత, రెడ్డి నవ్యలు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లీశ్వరి, ఉపాధ్యాయులు సీహెచ్.ప్రసాద్, మధుబాబు తదితరులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. లెక్కలు-2, జువాలజీ-2, హిస్టరీ-2 పరీక్షలు జరిగాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,287 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,246 మంది పరీక్షలు రాశారు. 41 మంది పరీక్షలకు హాజరు కాలేదు.

పీఎంపీ నూతన కార్యవర్గ ఎన్నిక



అత్తిలి మండలంలో నూతనంగా ఎన్నికైన పీఎంపీ కార్యవర్గ సభ్యులు

అత్తిలి: మండల ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం స్థానిక సంఘ భవనంలో జరిగింది. అత్తిలి మండల పీఎంపీ అధ్యక్షునిగా వాసు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా బాలాజీ, ఉపాధ్యక్షునిగా శర్మ, సహాయ కార్యదర్శిగా శ్రీను, గౌరవ అధ్యక్షునిగా కృష్ణమాచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అత్తిలి: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తణుకు సీడీపీఓ ప్రమోద తెలిపారు. అత్తిలి మండలం పాలూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టును ఎస్సీకేటగిరికి, పాలూరు-3 కేంద్రంలో సహాయకురాలు పోస్టును ఎస్సీ కేటగిరికి, స్కిన్నెరపురం అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు పోస్టును బీసీ-ఏ కు కేటాయించినట్లు ఆమె చెప్పారు. అర్హత కల్గిన స్థానిక మహిళలు తగు ధృవీకరణ పత్రాలతో ఈనెల 29వ తేదీ లోపుగా తణుకు కార్యాలయానికి అందజేయాలని ఆమె కోరారు.

ఘనంగా ప్రారంభమైన రంజాన్ ప్రార్థనలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

పెంటపాడు: రంజాన్ నెల ప్రారంభం పురస్కరించుకొని శుక్రవారం పలు గ్రామాల్లోని మసీదుల్లో నమాజు కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పెంటపాడు, కె. పెంటపాడు, వల్లూరుపల్లి, మీనవిల్లూరు, విప్పర్రు తదితర గ్రామాల్లోని మసీదులు విద్యుత్ దీపాలతో అలకరించారు.

యువ ఉత్సవ పోటీల్లో తణుకు విద్యార్థుల ప్రతిభ



బహుమతులు గెలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తణుకు టౌన్: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఏలూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఉత్సవ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినీలు పలు విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. కూచిపూడి విభాగంలో లతా మల్లేశ్వరి, ఇందుశాలిని, పావని, కార్తీక ప్రథమ బహుమతి, నగదు పురస్కారం అందుకున్నారు. చిత్రలేఖనంలో మౌనిక, డిక్లమేషన్ రోహిణి పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు పొందిన విద్యార్థినీలను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, అధ్యాపకులు కె పద్మజారాణి, పీ శివప్రసాద్, తదితరులు అభినందించారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

పెనుగొండ: జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమంలో భాగంగా పెనుగొండ మండలంలో 25 నుంచి 31 వరకూ పశువులకు టీకాలు వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రమీలా రాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

చిన్నారుల ఆరోగ్యానికి పెద్ద ప్రయత్నం

- సామ్-మామ్ ద్వారా శిశుసంరక్షణ
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు



అత్తిలి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్న దృశ్యాలు

అత్తిలి: గర్భం దాల్చిన నాటి నుంచి ఆరోగ్యకరమైన శిశువు జన్మించే వరకు ఆ మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఐసీడీఎస్ కృషి చేస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా నిధులను వెచ్చిస్తూ వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ ద్వారా ఆరు సరుకులతో కూడిన కిట్లను అందజేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మళ్లీ సామ్-మామ్ పథకాన్ని ప్రవేశపెట్టి నిర్దేశించిన సమయంలో చిన్నారులకు ఐసీడీఎస్ శాఖ వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. పొరపాటున ప్రమాదకరమైన వ్యాధులు సోకితే సత్వరమే మెరుగైన వైద్య సాయానికి సామ్-మామ్ దోహదపడుతుంది. వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు ఆరోగ్యరక్షణకు సూచనలు, సలహాలను అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్లస్టర్ పరిధిలో అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, పెంటపాడుల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.

సామ్-మామ్ నిర్వహణ ఇలా...

104 వాహనం ద్వారా సీనియర్ వైద్య నిపుణులతో సీనియర్ అడ్యూట్ మాట్ న్యూట్రిషియన్(సామ్) మోడరేట్ అక్యూట్ మాల్ న్యూట్రిషియన్(మామ్) పేరిట అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరేళ్ల బిడ్డ వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థుల ఎత్తు, బరువును కొలిచి ఐసీడీఎస్‌శాఖ రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. సామ్-మామ్ నిబంధనల మేరకు తక్కువ బరువు ఉన్న చిన్నారులకు సమీప ఆరోగ్యకేంద్రంలో ప్రతి 15 రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కండరాల బలహీనత, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. మూడు నెలల వైద్య పరీక్షలు చేసి, పౌష్టికాహారాన్ని అందించినా మార్పురాని పక్షంలో జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్సను అందజేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా పౌష్టికాహారం...

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా 2020 సెప్టెంబరు 7న ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా మాతా శిశు సంరక్షణ కింద ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల పౌష్టికాహారం అందిస్తున్నారు. రాగిపిండి, అటుకులు, జొన్నపిండి, ఐదు లీటర్ల పాలు, చిక్కి, కోడి గుడ్లు తోపాటు భోజనాన్ని వడ్డిస్తున్నారు. చిన్నారులకు ప్రతి నెలా 25 కిలోల బాలామృతం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు.

మెరుగైన రక్షణ...



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు మెరుగైన ఆరోగ్య రక్షణ లభిస్తుంది. వారిలో పౌష్టికాహార లోపం, రక్తహీనత తగ్గి శిశుమరణాల నివారణకు తోడ్పాటునందిస్తుంది. సామ్-మామ్ కార్యక్రమం ద్వారా గుర్తించిన పిల్లలను ఈ పౌష్టికాహారాన్ని అదనంగా ఇస్తూ, ఎప్పటికప్పుడు మెరుగైన చికిత్సను అందజేస్తున్నాం.

కె మేరీ ఎలిజబెత్‌రాణి,
సీడీపీడీ పెనుమంట్ర ప్రాజెక్టు

శశి కళాశాలలో జాతీయ సెమినార్



జాతీయ కాన్ఫరెన్సులో బ్రోచర్ ఆవిష్కరణ దృశ్యం

తాడేపల్లిగూడెం: స్మార్ట్ మెటీరియల్స్‌కు ప్రాధాన్యత పెరిగిందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రాంటియర్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ స్మార్ట్ మెటీరియల్స్ ఫర్ టెక్నోలాజికల్ అప్లికేషన్స్(ఫస్టు 2023)అప్లై డ్ సైన్సు అండ్ హుమానిటీస్ డిపార్టుమెంటు రీసెర్చ్ అండ్ డెవలప్మెంటు డిపార్టుమెంటు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిధులుగా ఓయన్‌జీసి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ, గౌరవఅతిధిగా ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ డి.యల్.శాస్త్రీలు పాల్గొన్నారు. బార్క్ సీనియర్ సైంటిస్టు డాక్టర్ కె.దివాకర్, జాతీయ ఫిజిక్స్ ల్యాబొరేటరీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.భాగ్యనారాయణ, డాక్టర్ ఎల్.దశరధరావులు మాట్లాడారు. అడ్వాన్సు స్మార్ట్ మెటీరియల్స్ పురోగతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

చలో దిల్లీ కార్యక్రమానికి జయప్రదం చేయండి



అత్తిలి బస్‌స్టేషన్‌సెంటర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలం

అత్తిలి: ఆదాని, అంబాని వంటి కార్పొరేటర్లకు దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో చలో దిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అత్తిలిలో శుక్రవారం జరిగిన సభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలం మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో దిల్లీ కార్యక్రమానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని, మోడీ విధానాలను వ్యతిరేకించాలన్నారు. దిల్లీలో రైతాంగ పోరాటంలో మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లాలో నాలుగు రోజులు ప్రచార జీపు జాతా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ జాతాలో ప్రజా నాట్యమండలి కళాకారులు పాటలు పాడి ప్రజలను చైతన్య పరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు కె గోపాలన్, కె ధర్మేంద్ర, మళ్ల సూర్యారావు, బొట్ట అప్పన్న, ఎల్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చే తీర్మానం హర్షణీయం

తణుకు టౌన్: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలంటూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించడం పట్ల మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కే జస్పాల్, తణుకు మండల యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ మనోజ్‌బాబ్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 26 ఏళ్ల నుంచి దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని చేసిన పోరాటాల ఫలితంగా సీఎం జగన్ చేసిన తీర్మానం దళిత జాతి అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. మతం మారినా కులం మారదని, కులం సామాజిక అంశమని, మతం ఆధ్యాత్మిక అంశమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి దళితుల్ని ఎస్సీల జాబితాలో చేర్చే విధంగా కృషి చేయాలని కోరారు.

ఉత్తమ ల్యాబ్ సూపర్‌వైజర్‌గా పంజా



జిల్లా కలెక్టరు ప్రశాంతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రవిబాబు

తణుకు అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్తమ సేవా అవార్డులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అందజేశారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని టీబీ విభాగంలో సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్ పంజా రవిబాబు బెస్ట్ ల్యాబ్ సూపర్‌వైజర్‌గా శుక్రవారం భీమవరంలో అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

రేపు కలవపూడి సొసైటీ మహాజనసభ

కాళ్ల: కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పెనుమత్స దుర్గ ప్రసాద్ రాజు, సీఈఓ కనుమూరి నరసింహారాజు తెలిపారు. కలవపూడి పంచాయతీ పరిధిలోని మోడి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించే మహాజన సభకు సంఘ సభ్యులు, రైతులు అందరూ హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

భీమవరం అర్బన్: పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా శనివారం నుంచి ఏప్రియల్ 24 వరకు టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు తెలిపారు. మండలంలోని 25 గ్రామాల్లో మూడు నెలలు పైబడిన ఆవులు, గేదెలకు పశు పెంపకందారుని ఇంటివద్దకెళ్లి ఉదయం నుంచి పశు వైద్య సిబ్బంది గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



వరిఘేడులో ఆంజనేయస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

అత్తిలి: వరిఘేడు గ్రామంలో పున:నిర్మించే భక్త ఆంజనేయస్వామి ఆలయానికి అత్తిలి మండల జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వెంకటరత్నం బాబు దంపతులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన భక్త ఆంజనేయస్వామి ఆలయాన్ని పున: నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, ఎంపీటీసీ సభ్యులు రంభ సుజాత, రంభసూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కంకటాల సతీష్, గ్రామ ప్రముఖులు అడ్డాల అనంతబాబు, గూనా మార్కండేయులు, అడ్డాల రామకృష్ణ, గూనా నాగయ్య, గూనా సత్రయ్యానాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ కల్యాణ, రథోత్సవాలు



కొండేపాడు కనకదుర్గమ్మ అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడు గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ఈవో శోభనాద్రి, ధర్మకర్తలైన తల్లాప్రగడ వంశీయుల ఆధ్వర్యంలో గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామ ఇలవేల్పు దుర్గమ్మ కల్యాణాన్ని వీక్షించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాస్త్రోత్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి రథోత్సవం నిర్వహించారు. వైఎఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మీనవిల్లూరు, చింతపల్లి, కోరిమిల్లి, దువ్వ తదితర గ్రామాలకు చెందిన భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టు విశాల్‌ను ఘనంగా సన్మానించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



అత్తిలి మండలం పాలిలో పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బాలింతలు, గర్భిణులు, కిశోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి దూరం కావొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్యామల తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం పాలి అంగన్‌వాడీ కేంద్రంలో మిల్లెట్స్ తీసుకోవడం కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముడి మినుములు వాడటం వల్ల ఎముకలు పటిష్ఠంగా ఉంటాయని, వీటిలో ఫైబర్, ఐరన్, పొటాషియం, బి3, బి12 మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతా గౌరీపార్వతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల బరువులు, ఎత్తులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి మాట్లాడుతూ బిడ్డ పెరుగుదల తల్లి తీసుకునే పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, గుబ్బల విజయవాణి, ఆశ వర్కర్లు రేణుక, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడుదాం



పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడుదామని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల 92వ వర్ధంతి కార్యక్రమం పట్టణంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. నాయకులు పతివాడ నాగేంద్రబాబు, శిద్ధిరెడ్డి శేషుబాబులు మాట్లాడుతూ ఈ నెల 28 వరకు అమరవీరుల వర్ధంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్రి అప్పారావు, గొర్రెల వంశీ, ధర్మాలు నారాయణ రావు, గొర్రెల సతీష్, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యాగర్లపల్లిలో డ్రైడే, ఫ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి యేలూరి వెంకట లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని యాగర్లపల్లి, 18వ వార్డు ప్రాంతాల్లో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. పరిసర ప్రాంతాలలో నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా సమీప పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు ఝాన్సీ, వెంకట లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.లక్ష్మిప్రియ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



జీపు జాతను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో జీపుజాతను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసనగా దిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వి గోపాలన్, వ్యవసాయ కార్మిక సంగం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, నాయకులు ఎం.సత్యనారాయణ, కండేల్లి సోమరాజు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఎ.దర్మారావు, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్మీకం పోస్టు తయారీపై శిక్షణ

పెంటపాడు: పంచాయతీలు చెత్తను సంపదగా మార్చుకొనేందుకు వీలుగా కంపోస్టు తయారీపై పూర్తి అవగాహన పెంచుకోవాలని పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు డంపింగ్ యార్డు ఎల్‌టీసీ శిక్షణా కేంద్రంగా అధికారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల పంచాయతీలకు శిక్షణ కేంద్రంగా వెలుగొందుతోంది. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఇంజనీరింగ్ సహాయకులు, వ్యవసాయ సహాయకులు, క్లాప్ మిత్రలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిచారు. చెత్త ద్వారా సంపదను సృష్టించుకోవడం ఎలా.... పంచాయతీలు చెత్త సమస్యలను అధికమించడం, కంపోస్టు ఎరువు ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవడం, తడి, పొడి చెత్త తదితర విషయాలపై పలువురు ప్రతినిధులు అవగాహన కల్పించారు. మరో రెండు రోజులు ఈ శిక్షణ కొనసాగుతుందని పెంటపాడు గ్రామ కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. గణపవరం మండలంలోని గణపవరం, సరిపల్లె, వరదరాజపురం, తాడేపల్లిగూడెం మండలంలోని నీలాద్రిపురం, కడియద్ద, పెంటపాడు మండలంలోని ముదునూరు, పెంటపాడు గ్రామాల సర్పంచ్‌లు, ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ విస్తరణాధికారులు, కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వే ద్వారా సమస్యల పరిష్కారం



దువ్వలో భూ సర్వే పనులు ప్రారంభిస్తున్న సర్వే, రెవెన్యూ అధికారులు

తణుకు టౌన్: జగనన్న శాశ్వత భూసర్వే ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో చేపట్టే శాశ్వత భూ సర్వేలో బాగంగా డ్రోన్ సర్వే పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ముద్దాపురం గ్రామంలో పైలెట్ గ్రామం జగనన్న శాశ్వత భూ సర్వే పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. పురాతన కాలం నుంచి ఉన్న రికార్డులను పరిశీలించి ప్రస్తుత భూస్థితిని ప్రతిబింబించేలాల సర్వే ద్వారా గుర్తించి కొత్త సర్వే రాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని కోనాల, దువ్వ, తేతలి గ్రామంలో సర్వే పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

సృజనాత్మకతకు సాంకేతికత జోడించాలి



యూట్యూబర్ రవితేజతో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: సృజనాత్మకతకు సాంకేతికత జోడించి అద్భుత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు ఆకాంక్షించారు. ఉత్సాహం ఉరకలేసింది. ఆనందంతో కుర్రకారు కిర్రాక్ పెట్టించారు. గొంతుతో గొంతు కలిపారు. నృత్యాలతో మైమరపించారు.ఆనందోత్సాహాల మధ్య వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టెక్ యుఫోరియా సాగింది. ప్రాజెక్ట్సు ఎక్స్‌పో, మీలో ఎవ్వరు జీనియస్, స్పాట్ ఫొటోగ్రఫీ, కవిత్వం, కళాప్రదర్శన, క్యాప్చర్ ది యుఫోరియా పోటీలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో కుర్ర కారు హోరు మిన్నంటింది.కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతకు ఆధునిక సాంకేతికతను జోడించి అద్భుత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాలలో 38 అంశాలలో, కళాశాల స్థాయిలో ఏడు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ రాంబాబు తెలిపారు.